'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# వివాదంలో 'మునక'!

ప్రధాని నరేంద్ర మోదీ లక్షద్వీప్ సముద్రతీరంలో సేదదీరుతూ సాయం సంధ్య వైపు చూస్తున్న ఫొటో మీడియాలో వైరలైంది. అదే ఫొటో మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభానికి దారితీయడం గమనార్హం. మాల్దీవుల మంత్రులు ముగ్గురు ప్రధాని మోదీ లక్షద్వీప్ విహారంపై చేసిన తీవ్ర వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. మాల్దీవులు టూరిజాన్ని దెబ్బతీసి లక్షద్వీప్‌ను ప్రోత్సహించడమే మోదీ లక్ష్యమని మాల్దీవుల మంత్రులు విమర్శించారు. విమర్శ వరకైతే ఫరవాలేదు కానీ వారు ఉపయోగించిన భాషపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. భారతీయ సామాజిక మాధ్యమాల్లో ఆ ముగ్గురు మంత్రులపై విమర్శలు పోటెత్తాయి. మాల్దీవుల విహారయాత్రకు భారత పౌరులు బుక్ చేసుకున్న విమానం టికెట్లు, హోటళ్ల గదులు పెద్దఎత్తున రద్దు చేసుకుంటున్నట్టు వార్తలు వెల్లువెత్తాయి. దీంతో అధ్యక్షుడు ముయిజూ నష్ట నివారణ చర్యలు చేపట్టారు. ఈ వివాదం చిలికి చిలికి గాలివానగా మారడంతో చివరికి ఆ ముగ్గురిని బర్తరఫ్ చేశారు. వారి వ్యాఖ్యలతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని ప్రకటించారు కూడా. మాల్దీవులు ప్రధానంగా టూరిజంపై ఆధారపడిన దేశం. చేపల వేట తర్వాత రెండో అతిపెద్ద ఆదాయ వనరు టూరిజమే. జీడీపీలో 28 శాతం, విదేశీమారక ద్రవ్యంలో 60 శాతం పర్యాటకమే సమకూరుస్తుంది. ఆ దేశాన్ని సందర్శిస్తున్న భారతీయుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. 2023లో అత్యధికంగా 2,09,198 మంది భారతీయులు ఆ దేశంలో పర్యటించారు. తాజా వివాదంతో పెద్ద సంఖ్యలో భారతీయులు వెనుకకు తగ్గుతున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. అంతేకాకుండా మాల్దీవులకు బదులుగా లక్షద్వీప్‌ను పర్యాటక లక్ష్యంగా ఎంచుకుందామనే ప్రచారమూ ఊపందుకున్నది. ఆ దేశ మంత్రుల వివాదాస్పద వ్యాఖ్యలతో టూరిజం మీద దెబ్బపడటాన్ని అక్కడి ప్రభుత్వం ఏ మాత్రం ఆహ్వానించదనేది తెలిసిందే.

అయితే, మాల్దీవులతో భారత్‌కు ఇదే మొదటి తగాదా కాదు. కొన్నేండ్లుగా రాజకీయ అస్థిరతతో సతమతమవుతున్న ఈ దీవుల దేశం ఇటీవలి కాలంలో చైనా ప్రభావంలోకి వెళ్లింది. చైనా విస్తరణవాద ప్రణాళికలో పావుగా మారింది. చైనా అనుకూలవాదిగా పేరున్న మహమ్మద్ ముయిజు నవంబర్‌లో అధ్యక్షుడిగా ఎన్నికైన రెండో రోజు నుంచే భారత వ్యతిరేక నిర్ణయాలతో సంచలనం సృష్టించారు. మాల్దీవుల్లో ఉన్న భారత బలగాలు వెనక్కి వెళ్లాలని ఆదేశించారు.

చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న మాల్దీవులను దెబ్బకొట్టేందుకు భారత్ అనుసరిస్తున్న వ్యూహంలో భాగంగానే ప్రధాని మోదీ లక్షద్వీప్‌లో పర్యటించారని అంటున్నారు. ఈ నేపథ్యంలో మాల్దీవుల పాలక ఎంపీలు, మంత్రులు ప్రధాని పర్యటనపై, భారతీయ సంస్కృతిపై అక్కసు వెళ్లగక్కారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెట్టారు. భారతీయులు మాల్దీవులకు వెళ్లవద్దని సెలబ్రిటీలు కూడా పిలుపునివ్వడం విశేషం. అటు ఢిల్లీలోని మాల్దీవుల రాయబారిని భారత విదేశాంగ శాఖ పిలిపించి మందలించింది. ఎంపీలు, డిప్యూటీ మంత్రుల వ్యాఖ్యలపై భారతీయులతో పాటు మాల్దీవుల విపక్ష పార్టీలు కూడా మండిపడ్డాయి. ఈ వివాదం రాజుకుంటున్న నేపథ్యంలో అధ్యక్షుడు ముయిజు చైనాకు ఐదు రోజుల పర్యటన కోసం బయల్దేరడం కూడా చర్చనీయాంశమైంది. మాల్దీవుల అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి ముందుగా భారత్ పర్యటనకు రావడమనేది ఒకప్పుడు ఆనవాయితీగా ఉండేది. కానీ చైనా విస్తరణవాద ప్రణాళికలో మాల్దీవులు భాగమైపోవడం దౌత్యపరంగా భారత్‌కు ప్రతికూలాంశమే. మంత్రుల తొలగింపు భారత్‌కు కొంత ఉపకరించే అవకాశం ఉన్నప్పటికీ మాల్దీవులను తిరిగి తన వైపు తిప్పుకొనేందుకు ఇది ఏ మేరకు పనికివస్తుందనేది అనుమానమే. చైనా విస్తరణకు అడ్డుకట్ట వేసేందుకు భారత్ దౌత్యపరంగా ఇంకా చేయాల్సింది ఎంతో ఉన్నదని చెప్పక తప్పదు.

---

**'కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేం'**

"ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం... పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాం. భవిష్యత్తులో మరే ఇతర ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చేది లేదు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడం లేదు.
- 2018, ఆగస్టు 10న అప్పటి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

**'పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేం'**

2014 నుంచి దేశంలోని ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడం లేదు. అందుకే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వడం లేదు."
- 2024, జనవరి 04న కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

# హోదాపై జాతీయ పార్టీల జలకాలాట

**2024, జనవరి 4న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జల్‌శక్తి శాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిశారు. వాళ్లు సదరు మంత్రిని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని కోరినట్టు పలు పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. అయితే కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 'దేశంలోని ఏ ప్రాజెక్టుకు ఇప్పుడు జాతీయ హోదా ఇవ్వడం లేదు. కానీ, ఏదేని పథకం కింద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి దాని అంచనాలో 60 శాతం నిధులు ఇస్తామని షెకావత్ హామీ ఇచ్చారు' అని ప్రకటించడం విడ్డూరం.**



బోయినపల్లి వినోద్‌కుమార్

2014లో మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అప్పటివరకు ఉన్నటువంటి ఏఐబీపీ, ఆర్‌ఆర్‌ఆర్ వంటి పథకాలను ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై)గా మార్చింది. పీఎంకేఎస్‌వై పథకం కింద చిన్న చిన్న నీటి పారుదల ప్రాజెక్టులు, డైవర్షన్ కెనాల్స్, ఫీల్డ్ చానెళ్లు, వాటర్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, చిన్న చిన్న ఎత్తిపోతల పథకాలను నిర్మించేందుకు రాష్ర్టాలకు కేంద్రం నిధులు అందిస్తున్నది. అదేవిధంగా రైతులకు డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, రెయిన్‌గన్నులు ఏర్పాటు చేసుకోవడానికి ఈ పథకం ద్వారా సాయం చేస్తున్నది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం 60 శాతం నిధులు ఇస్తామని చెప్పడం నమ్మశక్యంగా లేదు. ఎందుకంటే పీఎంకేఎస్‌వై పరిధిలో అంత పెద్ద మొత్తంలో నిధులు ఉండవనేది జగమెరిగిన సత్యం.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన చూసిన తర్వాత నేను ఒక్కసారిగా పదేండ్లు వెనక్కి వెళ్లాను. పద్నాలుగేండ్ల సుదీర్ఘ పోరాటాల అనంతరం 2014లో తెలంగాణ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష నేరవేరింది. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నాతో పాటు ఎంతోమంది ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు తెలంగాణ రాష్ర్టాన్ని అభివృద్ధి దిశగా పరిగెత్తించేందుకు తమ వంతు కృషిచేశారు. తత్ఫలితంగానే రాష్ర్టాన్ని పాలించమని తెలంగాణ ప్రజలు రెండోసారి కేసీఆర్ నాయకత్వానికి పట్టం కట్టారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రపథంలో నిలబెట్టారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకోవడమే కేసీఆర్ నేతృత్వంలో జరిగిన రాష్ర్టాభివృద్ధికి నిదర్శనం. అయితే ఇప్పుడు ప్రాజెక్టులు-వాటి జాతీయ హోదా విషయమై చర్చిద్దాం.

స్వాతంత్య్రం వచ్చిన 75 ఏండ్లలో దేశంలో ఇప్పటివరకు మంజూరైన జాతీయ ప్రాజెక్టులు 17. అందులో పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకశ్మీర్, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ర్టాల్లో రెండేసి జాతీయ ప్రాజెక్టులు, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, యూపీ, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఏపీ, అసోం, కర్ణాటక రాష్ర్టాల్లో ఒక్కో జాతీయ ప్రాజెక్టు మంజూరైంది. హిమాచల్/ఉత్తరాఖండ్ రాష్ర్టాలకు ఒక ఉమ్మడి జాతీయ ప్రాజెక్టు మంజూరైంది. దేశంలో 28 రాష్ర్టాలుంటే 11 రాష్ర్టాల్లో మాత్రమే జాతీయ ప్రాజెక్టులున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ మొదలు అప్పటి కేంద్ర జలవనరుల శాఖమంత్రులు ఉమాభారతి, నితిన్ గడ్కరీ, గజేంద్ర షెకావత్ దాకా రాష్ట్రంలోని ఏదేని ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని చాలాసార్లు విన్నవించుకున్నాం. సాగునీటి పారుదల శాఖ అధికారులతో కలసి అనేకసార్లు లేఖలు రాశాం. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా మోదీకి ఎన్నోసార్లు విన్నవించుకున్నారు. అయినా మా విన్నపాలను కేంద్ర ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. ఒక్క తెలంగాణకే కాదు దేశంలోని అన్ని రాష్ర్టాల్లోని ఏదేని ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని పోరాటం చేసిన ఘనత ఉద్యమ నాయకుడైన కేసీఆర్‌ది.

**2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం సాగునీటి రంగంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి పలు పథకాలను రూపొందించింది. పరాయి పాలనలో జరిగిన అన్యాయాన్ని సవరించడానికి అప్పటి ప్రభుత్వం తీవ్రంగా శ్రమించింది. కేసీఆర్ నేతృత్వంలో నాతో పాటు అప్పటి ఎంపీలందరం కలిసి కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కవలసిన వాటా కోసం పార్లమెంటులో పెద్ద ఎత్తున పోరాటం చేశాం. చాలాసార్లు పార్లమెంటును సాగకుండా చేసిన సందర్భాలున్నాయి.**



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం 2014 తర్వాత ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని చెప్పుకొంటూనే ఎన్నికలు వచ్చిన రాష్ట్రంలోని ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తూ లబ్ధి పొందే ప్రయత్నం చేసింది. 2021లో ఉత్తరప్రదేశ్‌లోని సరయూనహర్ ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ హోదా కల్పించింది. అనంతరం 2022లో యూపీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగగా యోగి సర్కార్ రెండోసారి అధికారంలోకి వచ్చింది. యూపీలో ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి అధికారంలోకి వచ్చిన బీజేపీ కర్ణాటకలోనూ అదే ఫార్ములాను పాటించింది. అందులో భాగంగానే కర్ణాటకలోని అప్పర్‌భద్రా ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తున్నట్టు ప్రకటించి ఎన్నికలకు పోయింది. అయితే ఇక్కడ బీజేపీ బొక్కబోర్లా పడ్డది. అయినప్పటికీ తాజాగా జరిగిన మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికల్లో ఇదే ఫార్ములాను బీజేపీ మరోసారి నమ్ముకున్నది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ర్టాలకు లబ్ధి చేకూరేవిధంగా 'ఈస్టర్న్ రాజస్థాన్ కెనాల్' ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి ఎన్నికల బరిలో దిగింది. తత్ఫలితంగా బీజేపీ ఆయా రాష్ర్టాల్లో అధికారాన్ని చేజిక్కించుకున్నది.

ఇదిలా ఉంటే.. 2024 జనవరి 4న విలేకరుల సమావేశంలో అసలు విషయం బయటపడింది. కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ 'దేశంలోని ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడం' లేదని చెప్పినప్పుడు ఒక విలేకరి కర్ణాటక ప్రాజెక్టుకు జాతీయహోదా కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. కర్ణాటక ప్రాజెక్టుకు ప్రకటించిన జాతీయ హోదాను వెనక్కి తీసుకున్నామని ఆ సమావేశంలో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్... సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల సమక్షంలో ప్రకటించడం విడ్డూరం. అయితే దీనివెనుక ఉన్న మతలబు ఏమంటే... కర్ణాటకలో బీజేపీ ఓటమికి ప్రతీకారంగానే అక్కడి ప్రాజెక్టుకు జాతీయ హోదా రద్దు చేశారని స్పష్టమవుతున్నది.

కాంగ్రెస్ నాయకులకు గానీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గానీ నేను చెప్పొచ్చేదేమంటే... తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేయడం ఇకనైనా ఆపండి. రాష్ట్రంలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించేదాన్క కాంగ్రెస్ నాయకులు పోరాడాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నా. 2014లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని తీసుకువచ్చింది. నాడు గోదావరి నదిపై నిర్మితమవుతున్న పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే నిధులిస్తుందని చెప్పింది. అదే కాంగ్రెస్ ప్రభుత్వం నాడే ఆ ప్రాజెక్టు జాతీయ హోదాకు సంబంధించి చట్టబద్ధత కల్పించింది. అందుకే ఇప్పటికీ కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు నిధులు సమకూర్చుతున్నది. నిధులు సమకూర్చాలి కూడా. ఎందుకంటే పార్లమెంటు సాక్షిగా పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా లభించింది కాబట్టి. నాడే మన్మోహన్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా తెలంగాణలో కూడా కృష్ణా నదిపైన నిర్మించేటువంటి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశానికి చట్టబద్ధత కల్పిస్తే బాగుండేది. కానీ యూపీఏ ప్రభుత్వం అలా చేయలేదు. ఆ నిర్ణయం తెలంగాణ ప్రజలకు శాపంగా మారింది. నాడు తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తే, రాష్ట్రంలో గెలిచిన నలుగురు బీజేపీ ఎంపీలు నేటికీ రాష్ట్ర ప్రజలను నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. వాళ్లు ఎంపీలుగా గెలిచి ఐదేండ్లు పూర్తికావస్తున్నా రాష్ర్టానికి నిధులు తీసుకురావడం పక్కనపెడితే కనీసం ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయహోదా తీసుకురాలేకపోయారు. ఇప్పటికైనా కృష్ణా నదిపై నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నా.

**మన్మోహన్ నేతృత్వంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీ విభజన చట్టంలో భాగంగా తెలంగాణలో కూడా కృష్ణా నదిపైన నిర్మించేటువంటి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశానికి చట్టబద్ధత కల్పిస్తే బాగుండేది. కానీ యూపీఏ ప్రభుత్వం అలా చేయలేదు. ఆ నిర్ణయం తెలంగాణ ప్రజలకు శాపంగా మారింది. నాడు తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తే, రాష్ట్రంలో గెలిచిన నలుగురు బీజేపీ ఎంపీలు నేటికీ రాష్ట్ర ప్రజలను నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. వాళ్లు ఎంపీలుగా గెలిచి ఐదేండ్లు పూర్తికావస్తున్నా రాష్ర్టానికి నిధులు తీసుకురావడం పక్కన పెడితే కనీసం ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయహోదా తీసుకురాలేకపోయారు.**

**(వ్యాసకర్త: పార్లమెంటు మాజీ సభ్యులు, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు)**

---

# ఆరు గ్యారెంటీలు.. ఆరు సవాళ్లు

**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు పూర్తయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి ఆలోచన, విజన్ లేకుండా కేవలం కేసీఆర్ కుటుంబంపై వ్యక్తిగతంగా నిందలు వేసి, ప్రజల్లో లేని ఒక వ్యతిరేకతను సృష్టించడం వల్లనే అధికారంలోకి వచ్చింది. ఏదేమైనప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తామని తెలుపుతూనే, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్ని పార్టీలు కోరుతున్నాయి. కాంగ్రెస్ కూడా ఎన్నికల ప్రచారంలో పలుమార్లు ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పుకొంటూ వచ్చింది. అసలు ఈ ఆరు గ్యారెంటీలు సాధ్యమేనా? ఇవి అమలుచేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అసలు ఏం చేయాలి? వీటి సవాళ్లను తెలుసుకుందాం.**



కన్నోజు శ్రీహర్ష
89851 30032



మొదటి గ్యారెంటీ కింద మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం, సిలిండర్ 500, రూ.2,500 మహిళలకు ఇస్తామని తెలిపింది. రేషన్‌కార్డున్న మహిళలకే ఉచిత బస్సు సౌకర్యం ఉంటుందా? మిగతా వారు ఉచిత బస్సు సౌకర్యం కోల్పోతారా? అనే ప్రశ్న ప్రజల్లో మొదలైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా రవాణాను ప్రైవేట్‌పరం కాకుండా మెట్రో, ఆర్టీసీని అనుసంధానిస్తూ కామన్ మొబిలిటీ కార్డు తెచ్చే ప్రయత్నం చేసింది. కానీ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నది. సిలిండర్ రూ.500కు ఇస్తామంటున్నది. ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ప్రజలకు ఇస్తుందా? లేదా ప్రభుత్వమే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ద్వారా కొనుగోలు చేసి ప్రజలకు ఇస్తుందా? సిలిండర్ రేటు అంతర్జాతీయ అంశాలపై ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా సిలిండర్లను మార్కెట్ రేటుకు అనువుగా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. అంటే ఇది ప్రభుత్వానికి ఒక పెద్ద సవాలు. ఇప్పటికే కేంద్రం ఇస్తున్న ఎల్పీజీ సౌభాగ్య పథకం కింద ఉన్నవారిని ఇందులో అర్హులుగా చేర్చుతారా? అంటే రేషన్ కార్డున్న వారికి గ్యాస్ సిలిండర్‌పై కొన్ని ఆంక్షలుంటాయి. మరి ఇప్పుడున్న వారందరికీ ఇది వర్తిస్తుందా? మహిళలకు రూ.2,500 ప్రతి నెల ఇస్తామన్నారు, ఎలా ఇస్తారు? పింఛన్ తీసుకుంటున్న అవ్వలకు, ఒంటరి మహిళలకు ఏది వర్తిస్తుంది? దీనిమీద ప్రభుత్వం దగ్గర ఎలాంటి విధివిధానాలున్నాయో ప్రజలకు తెలియడం లేదు.

**రెండవ గ్యారెంటీ రైతు భరోసా.** రాష్ట్రంలో రైతుబంధు తీసుకుంటున్న వారి సంఖ్య 70 లక్షలు. ఈ ఏసంగికి ఇంకా రైతుబంధు పడలేదు. ఎకరానికి రూ.15,000 ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దానిని నెరవేర్చలేదు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఎలా ఇస్తారు? కౌలు రైతులకు ఈ రోజు పాసుబుక్ లేదు. మరి వారికి ఎలా అమలుచేస్తారు? భూ యజమానికి, కౌలు రైతుకు ప్రభుత్వం ఏమైనా గ్యారెంటీ పత్రం ఇస్తుందా? 1952లో తీసుకువచ్చిన హైదరాబాద్ కౌలుదారు చట్టాన్ని మళ్లీ అమలుచేస్తుందా? కూలీలకు రూ.12,000 ఎలా ఇస్తారు? రైతు కూలీలు ఏదైనా పథకం లబ్ధి పొందినట్టయితే దానివల్ల ఉపాధిహామీ పథకానికి ఇబ్బందులు తలెత్తే అవకాశాలుంటాయా?. 100 ఎకరాలున్న వారికే రైతుబంధు వస్తుందని తప్పుడు ప్రచారం చేసిన కాంగ్రెస్ ఈ రోజు రైతుభరోసా విషయంలో ఇన్ని ఎకరాల్లోపే ఇస్తామని ఎక్కడా చెప్పడం లేదు. 2018 నుంచి నిర్విరామంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు వేస్తూ రూ.65 వేల కోట్లకు పైగా ఖర్చుచేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారి రైతుబంధు డబ్బులనే పూర్తిగా వేయలేకపోతున్నది.

**మూడవ గ్యారెంటీ యువ వికాసం.** ప్రతి విద్యార్థికి రూ.5 లక్షల కార్డును అందిస్తామన్నారు. ఇది ఏ విధంగా అమలుచేస్తారు? 18 ఏండ్లు నిండిన వారికిస్తారా? లేక నిరుద్యోగులకిస్తారా? ఒకవేళ 18 ఏండ్లు నిండిన వారికిస్తే ప్రభుత్వ ఖజానా మీద భారీగా భారం పడే అవకాశం ఉన్నది. ఇవేకాకుండా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వానికి భారీగా భారం పడుతుంది. నిరుద్యోగులకిస్తే అసలు ఎంత మంది నిరుద్యోగులున్నారు? వారిని ఏ ప్రాతిపదికన గుర్తిస్తారు? LFPR (Labour Force Paricipation Rate) ప్రకారంగానా? లేక CWS (Current Weekly Status) ద్వారా నిరుద్యోగాన్ని కొలుస్తారా? ఇవన్నీ కూడా ప్రజల్లో తలెత్తుతున్న ప్రశ్నలు.

**నాలుగవ గ్యారంటీ ఇందిరమ్మ ఇల్లు.** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మన రాష్ర్టానికి కేటాయించినవి 1,90,000 గృహాలు. వీటిలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 1,20,000పైన నిర్మించింది. మరిప్పుడు మిగిలిన వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం కడుతుందా? లేదా ఇందిరమ్మ పేరు మీద మళ్లీ కొత్తవి నిర్మిస్తుందా? కొత్తవి నిర్మిస్తే ఎన్ని నిర్మిస్తుంది? అర్హులకు రూ.5 లక్షల సాయమన్నారు. గత వారం గృహలక్ష్మి కింద నమోదు చేసుకున్న లబ్ధిదారులను పూర్తిగా రద్దుచేసింది నేటి ప్రభుత్వం. మరి వారందరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తుందా? కొత్తవి నిర్మిస్తే ప్రభుత్వంపై పెనుభారం పడే అవకాశం ఉన్నది. ప్రజాపాలన ఫాంలో సైతం ప్రజలు పెద్ద ఎత్తున డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసమే నమోదు చేసుకున్నారు. వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందుతాయా అనేది ప్రజల్లో మెదులుతున్న ప్రశ్న.

**ఐదవ గ్యారెంటీ గృహజ్యోతి.** ఇది కాంగ్రెస్‌కు పెనుసవాలుగా మారనున్నది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తామన్నారు. 200 యూనిట్లు అంటే దాదాపు 700-800 మధ్య కరెంటు బిల్లు వస్తుంది. రాష్ట్రంలో కోటి గృహాలకు కరెంటు కనెక్షన్లున్నాయి. ప్రతి నెల 700 X 10000000... అంటే ప్రభుత్వంపై పెద్ద ఎత్తున భారం పడే అవకాశం ఉన్నది. రాష్ట్రంలో 26 లక్షల వ్యవసాయ కనెక్షన్లున్నాయి. మరి గృహజ్యోతి పథకం ఈ కనెక్షన్లకు వర్తిస్తుందా? కర్ణాటకలో దీనివల్ల భారీగా కరెంటు కోతలు మొదలయ్యాయి. పథకం లబ్ధి పొందనివారిపై భారీగా భారం పడుతుంది. ఉదాహరణకు 203 యూనిట్లు వస్తే ప్రజలు 3 యూనిట్ల వరకు బిల్లు చెలించాలా? లేక 203 యూనిట్ల బిల్లు చెల్లించాలా? ఎందుకంటే విద్యుత్తు రేట్లు స్లాబుల ప్రకారం లెక్కించబడుతాయి. స్లాబుకు 1 యూనిట్ పెరిగినా భారీగా బిల్లులో తేడా వస్తుంది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద సవాలు.

**ఆరవ గ్యారంటీ చేయూత.** ప్రభుత్వం ఏర్పాటైన నెల నుంచి రూ.4 వేల పింఛన్ అందిస్తామని చెప్పారు. ఈ పథకం మొదటి గ్యారంటీలోని మహాలక్ష్మిలో రూ.2500 తీసుకున్న మహిళలకు, ఈ పథకానికి అర్హులైన వారి మధ్య క్లాష్ అయ్యే అవకాశం ఉన్నది. అందులో లబ్ధి పొందిన వారికి ఇది వర్తిస్తుందా లేదా? అన్నది వేచి చూడాలి. గత ప్రభుత్వం కేవలం ఆధార్ ఉన్న వారందరికి పింఛన్ కల్పించింది. గ్రామాల్లో రేషన్‌కార్డు లేనివారు కూడా పింఛన్ తీసుకుంటున్నారు. మరి వీరికిప్పుడు ఈ పథకం వర్తిస్తుందా?

**కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలంటే ప్రధానంగా వీరు చేయాల్సింది సామాజిక, ఆర్థిక సర్వే. దీని ద్వారానే నిజమైన లబ్ధిదారులు బయటకి వస్తారు. ప్రస్తుతం అనర్హులకు సైతం రేషన్‌కార్డులున్నాయి. మొదట వీటిని రద్దుచేయాలి. బీహార్ రాష్ట్రం మాదిరి కులగణన చేయడం ద్వారా కూడా మరింతగా లబ్ధి చేకూర్చే అవకాశం ఉంటుంది. అప్పుడే ఈ 6 గ్యారెంటీలు నిజమైన లబ్ధిదారులు పొందగలుగుతారు. ఇలా లైనులో నిలబడి భారీగా దరఖాస్తులు నింపితే సాధ్యమయ్యే పనులు కావివి.**

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రం ప్రవేశపెట్టి రాష్ట్ర ఆర్థికపరిస్థితిని తెలియజేసింది. ఇప్పుడు ఈ 6 గ్యారెంటీలను అమలుచేస్తే ఏటా రూ.1,50,000 కోట్ల నుంచి రూ.2 లక్షల కోట్ల వరకు భారం పడే అవకాశం ఉన్నది. అంతేకాకుండా రాష్ట్రంలోని నిర్మాణరంగంలో అమలవుతున్న పనులకు ఆటంకం కలుగవచ్చు. పాలమూరు-రంగారెడ్డి చివరి దశ, ఐటీ టవర్లు, కాళేశ్వరంలో చివరి లింకు, మున్సిపాలిటీల నిర్వహణ, పల్లె ప్రగతి కార్యక్రమాలకు భారీగా నిధులు అవసరమవుతాయి. ఇన్ని సవాళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేది రాష్ట్ర ప్రజలకు అంతుచిక్కడం లేదు.

---




## ఈ-కేవైసీతో పరేషాన్

**వంట గ్యాస్ ఈ-కేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్ల కార్యాలయాల వద్ద ఉదయం నుంచే రద్దీ కనిపిస్తున్నది. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నవారు గంటల తరబడి లైన్లలో వేచి ఉంటున్నారు. ఉజ్వల పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్ తీసుకున్నవారు, సాధారణ కనెక్షన్ ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీ రావాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి. అయితే ఇది పూర్తి చేసేందుకు ఎటువంటి గడువు విధించలేదు.**

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే గ్యాస్ అందిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు నియమ నిబంధనలు రూపొందించలేదు. ఎవరెవరు ఈ పథకానికి అర్హులు.. ఏ ప్రాతిపదికన అమలు చేస్తారో స్పష్టత ఇవ్వలేదు. కానీ, రూ.500కే గ్యాస్ రావాలంటే ఈ-కేవైసీ చేయించుకోవాలనే ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా జోరందుకున్నది. దీంతో గ్యాస్ వినియోగదారులు ఏజెన్సీలకు పెద్దఎత్తున తరలుతున్నారు. ఈ-కేవైసీలో భాగంగా కంటి స్కానింగ్ చేస్తుండగా.. దీనికి ఎక్కువ సమయం పడుతున్నది. ఒక్కొక్కరికి స్కానింగ్ చేసేందుకు 10 నుంచి 15 నిమిషాలు పడుతున్నది. దీంతో రోజంతా పనులు వదులుకొని గ్యాస్ ఏజెన్సీల వద్దనే వేచి ఉండాల్సి వస్తున్నది. రద్దీ దృష్ట్యా మీ సేవ కేంద్రాల్లోనూ ఈ- కేవైసీ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉన్నది. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో ఈ-కేవైసీ పూర్తిచేసి ఏజెన్సీలు డబ్బులు తీసుకుంటున్నాయి. మీ సేవ కేంద్రాల్లోనూ ఈ విధంగా సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. లేదంటే ఏజెన్సీలు తాత్కాలికంగా అదనపు సిబ్బందిని నియమించుకొని ప్రక్రియను వేగవంతం చేయాలి. తద్వారా సమయం ఆదా అవుతుంది. ప్రజలకు ఉపశమనం కలుగుతుంది.

**- తలారి గణేష్**